క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మదనాపురం: మండల కేంద్రంలోని వడ్డెర వీధిలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం బీజేపీ ఇన్‌చార్జ్ కొండా ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు బాబుగౌడ్, కొండా వెంకటేశ్వరశెట్టి, శ్రీనివాస్, పరశురాములు, నితిన్‌కుమార్, సంజీవ్‌కుమార్, కురుమన్న, వడ్డె రాజు, బురాన్, రమేష్, యాదగిరి, కొండన్న, బాలవర్ధన్, పాపన్న, వెంకటేష్, ప్రకాష్, రేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధరలు తగ్గించాలని రాస్తారోకో



అమరచింత: పేద, మధ్య తరగతి ప్రజలకు గుదిబండగా మారిన వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలంటూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం బస్టాండ్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఖాళీ సిలిండర్లతో నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు రాజన్న, రాజు, మస్లమని, కురుమన్న, ప్రేమరత్నం, భక్తి, జిలాని తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్మార్ట్‌టీవీల అందజేత



ఆత్మకూర్: మండలంలోని జూరాల ప్రభుత్వ పాఠశాలకు గురువారం రూ. 56 వేలు విలువ చేసే రెండు స్మార్ట్ టీవీలను జన్‌కో ఉద్యోగులు హెచ్‌ఎం రాఘవేందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో జన్కో ఎస్ఈలు శ్రీధర్, సురేష్, డీఈలు రాజు, రూపేష్, దర్బార్‌వలీ, ఈఈ శివకుమార్, ఏఈలు స్వాతి, వెంకటేశ్వర్‌రావు, రవిశంకర్, రాజేష్, పాఠశాల చైర్మన్ మహేశ్వరమ్మ, జీహెచ్‌ఎం మద్దిలేటి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు



ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా, తాగునీటి ఎద్దడి రాకుండా పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్నామని ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిప్పడంపల్లిలో జీపీ రికార్డులు పరిశీలించి, గ్రామంలో ఉన్న సమస్యల గురించి ఆరా తీశామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, కార్మికులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని వివరించారు. అలాగే నర్సరీలను సందర్శించి మొక్కలు వాడిపోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వంశీధర్‌రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వనపర్తి రూరల్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆదేశాల మేరకు గురువారం శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన సుజాతకు రూ.20 వేలు, బండలయ్యకు రూ.13 వేల ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు యాదవ్ లబ్ధిదారులకు అందజేశారు.



నేరరహిత గ్రామం రామన్‌పాడు

- గ్రామస్తులందరూ సోదరభావంతో మెలగాలి
- బెట్టింగ్, డ్రగ్స్‌తో జీవితాలు నాశనం
- ఎస్పీ రావుల గిరిధర్



ఎస్పీ రావుల గిరిధర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు నేరరహిత గ్రామంగా ఉండడం అభినందనీయమని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. రామన్‌పాడులో శాంతిభద్రతలు, సైబర్ నేరాలలు, బెట్టింగ్ యాప్‌లపై గురువారం రాత్రి ఆత్మకూర్ సీఐ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేరరహిత గ్రామం ఉన్నందుకు గర్వపడాల్సి ఉందన్నారు. ప్రజల రక్షణ, భద్రత కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, వారికి సహకరించాలని కోరారు. ప్రశాంత వాతావరణం, శాంతిభద్రతలు అదుపులో ఉండి ప్రజలు సోదరభావంతో మెలిగితే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయన్నారు. వర్గాలుగా ఏర్పడి ఎప్పుడూ గొడవలు పడుతూ ఉంటే పర్యవసానాలు భవిష్యత్ తరాలపై పడుతుందని వివరించారు. సమస్యాత్మక గ్రామంగా పోలీసు రికార్డుల్లో ఒకసారి నమోదైతే ఆ చెడ్డ పేరు ఎప్పటికీ అలాగే నిలిచి పోతుందన్నారు.

గొడవలతో ఫలితం శూన్యం

గొడవల ద్వారా సమస్యలు పరిష్కారం కావని, అందరూ సమష్టిగా ఉండి మాట్లాడుకుంటే పరిష్కారం కాని సమస్యలే లేవన్నారు. ఎవరైనా ఒక వ్యక్తిపై రౌడీ షీటర్‌గా ముద్ర పడితే గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా మొదటిగా అతడినే అదుపులోకి తీసుకొని విచారించాల్సి వస్తుందని, అలాంటి పరిస్థితి తీసుకురావొద్దని సూచించారు. యువత ఒక్కసారి కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్‌లో ఉద్యోగాలు,, విదేశాలకు వెళ్లే అవకాశం, పాస్‌పోర్ట్, వీసా పొందే విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. చిన్న పిల్లలను, మహిళలను వేధిస్తే షీ టీం నంబరు 63039 23211 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అనవసర లింకులు నొక్కొద్దు

మొబైల్‌కు వచ్చే లింకులను నొక్కి ఎందరో ఆర్థికంగా నష్టపోయారని, ఎవరూ డబ్బులు ఊరికే ఇవ్వరనే విషయాన్ని యువత, విద్యార్థులు గుర్తుంచుకోవాలని సూచించారు. జూదం, క్రికెట్ బెట్టింగులు, ఆన్‌లైన్ రుణాల ఊబిలో చిక్కుకుంటే బయటపడడం చాలా కష్టమని, అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. గ్రామాల్లో పీడీఎస్ బియ్యంతో అక్రమ వ్యాపారం చేయొద్దని, అలాంటి వారి గురించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాస్త్ర సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందుతున్న కాలంలో ఇంకా మూఢనమ్మకాల మాయలో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆత్మకూర్ సీఐ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, ఎస్ఐ శేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఈత కొట్టే సమయంలో జాగ్రత్త



ఈతకు వచ్చిన చిన్నారులు, యువకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్‌గౌడ్

ఖిల్లాఘనపురం: వేసవిలో తరుచుగా బావులు, చెరువులు, వాగుల్లో ఈత కొట్టే సమయంలో యువత, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. గురువారం మండలంలోని మామిడిమాడలో పర్యటించిన ఆయన నేరెడు చెరువు రిజర్వాయర్‌లో ఉన్న గుండుబావిలో ప్రతిరోజు యువకులు, విద్యార్థులు ఈతకొడుతుంటారని తెలుసుకుని నేరుగా అక్కడికి వెళ్లారు. ఈత కొట్టే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కొత్తగా ఈత నేర్చుకునే వారిని వెంట వచ్చే వారు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. ఈత కొట్టే సమయంలో బావి రాతి కట్టడాలకు దూరంగా ఉండాలని, ఒకరిపై ఒకరు దూకడం వలన లోపల ఉన్న వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందే అవకాశం ఉందని వివరించారు. గతంలోనూ ఈదే బావిలో పలు ఘటనలు జరిగి కొందరు మృతి చెందారన్నారు. ఈత రాని వారిని బలవంతంగా ఎవ్వరూ కూడ బావిలోకి నెట్టకూడదని హెచ్చరించారు. ఏదైనా ఇబ్బంది కలిగితే కుటుంబ సభ్యులకు, పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

సోషల్ మీడియాను దుర్వినియోగం చేయొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాము, సిబ్బంది

గోపాల్‌పేట: వాట్సాప్ గ్రూపుల్లో ఏవైనా విషయాలు షేర్ చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే సందేశాలను పంపితే చర్యలు తీసుకుంటామని రేవల్లి ఎస్ఐ రాము అన్నారు. గురువారం ఆయన రేవల్లి మండలంలోని నాగాపూర్‌లో సోషల్ మీడియా వినియోగం, మూఢనమ్మకాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. గురువారం ఉదయం స్థానికంగా ఉండే గుడి వద్ద కుక్కబొమ్మ ఆకారంలో ఉండే నీటి తడి, నిమ్మకాయలు కనిపించడంతో అది ఫొటో తీసి కొందరు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. దీంతో అప్రమత్తమైన రేవల్లి పోలీసులు నాగపూర్ గ్రామానికి చేరుకొని వివరాలు ఆరా తీశారు. అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి బకెట్‌లో నీళ్లు, నిమ్మకాయలు ఊరు బయట పడేసేందుకు తీసుకువెళ్తుండగా కింద పడిపోయాయని వివరించారు. గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు, కొత్త వ్యక్తులు సంచరించినట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు

ఢిల్లీ వెళ్లిన డీపీఆర్వో

వనపర్తి: దేశ రాజధాని ఢిల్లీలోని ఇండియన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ శిక్షణ కేంద్రంలో బుధవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఒక్కో మీడియా నోడల్ అధికారి, సోషల్ మీడియా నోడల్ అధికారి, డీపీఆర్వోకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణకు రాష్ట్రం నుంచి ముగ్గురు అధికారులు హాజరుకాగా.. అందులో వనపర్తి డీపీఆర్వో సీతారాంనాయక్ అవకాశం దక్కింది. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడం, స్థానికంగా నిర్వహించే అన్నిరకాల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనేలా ప్రజలకు అవగాహన కల్పించాలని భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్ వివరించినట్లు ఆయన తెలిపారు. వాహనాలు వెళ్లలేని ఏజెన్సీ ప్రాంతాలకు సైతం గుర్రపు బండ్లు, ఒంటెలపై ఈవీఎంలను తరలించి ఎన్నికలు నిర్వహించినట్లు ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసినట్లు చెప్పారు. సమావేశానికి వివిధ రాష్ట్రాల మీడియా నోడల అధికారులు, సోషల్ మీడియా నోడల్ అధికారులు హాజరైనట్లు తెలిపారు.

‘25 ఏళ్ల గులాబీ పండుగను విజయవంతం చేద్దాం’



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పల్లె, పల్లె నుంచి గులాబీ దండు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం రజతోత్సవ సభ మండల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీకి కట్టుబడి కష్టకాలంలో అండగా ఉన్న నేతలకు పార్టీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో గతంలో చేసిన అభివృద్ధి తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలంలో చేసింది శూన్యమని ఎద్దేవా చేశారు. ప్రజా పాలనలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అక్రమ కేసులు పెడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, అక్రమ కేసులు పెడుతూ పక్షపాతం చూపుతున్న అధికారులు తప్పక మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రస్థానం భావితరాలకు స్ఫూర్తిని కలిగించాలని బీఆర్ఎస్ రజతోత్సవ సభను ఏర్పాటు చేశారని తెలిపారు. అంతకముందు ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు శేఖర్‌నాయక్, రవికుమార్, రాజేశ్వర్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు, జ్యోతినందన్‌రెడ్డి, వీరసాగర్, రమేష్ రెడ్డి, దశరథనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ మండల సమావేశం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణమండపంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరవుతారని చెప్పారు. మండంలోని అన్ని గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

‘వైద్యుల నిర్లక్ష్యంతోనే ప్రాణాలు పోతున్నాయి’



అమరచింత: వైద్యుల నిర్లక్ష్యం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు లేని కారణంగానే ప్రసూతి కోసం వస్తున్న గర్భిణులు పురిట్లోనే తమ బిడ్డల ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని బీజేవైఎం, బీజేపీ నాయకులు గురువారం డీఎంఆర్‌ఎం పీహెచ్‌సీ ఎదుట ఆందోళన నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సుధీర్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులు ధరించి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ ఆస్పత్రికి చేరుకొని ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని చంద్రగఢ్ గ్రామానికి చెందిన గర్భిణి అనిత పురిటి నొప్పులతో మండల కేంద్రంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిందన్నారు. విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు అనితను పరిశీలించి సాధారణ కాన్పు చేస్తామంటూ ఇంజక్షన్లు ఇవ్వడంతో బిడ్డ అడ్డం తిరిగిందన్నారు. పరిస్థితి చేయి దాటిందని అంబులెన్స్‌లో ఆత్మకూర్‌కు తరలించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. సరైన వైద్యులు, గైనకాలజిస్ట్ లేకపోవడం, సిజేరియన్ చేయడానికి సౌకర్యాలు లేవని తెలిసి కూడా ఇక్కడి సిబ్బంది వైద్యం చేయడం ద్వారా అనిత తన బిడ్డ ప్రాణాలను కోల్పోయిందన్నారు. అనితకు న్యాయం చేయాలని, సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, స్థానిక ఆస్పత్రిలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారి డాక్టర్ ఫయాజ్‌ఆహ్మద్‌కు అందించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కదిరె మధు, ప్రధాన కార్యదర్శి బిట్టి రాజశేఖర్, మరాఠీ అశోక్, మెరువ అనిల్, సత్యనారాయణ, వంశీ, శ్రీనివాసులు, మంగ అంజి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొత్తకోట రూరల్: వారం రోజులుగా ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని, గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట ఎస్ఐ ఆనంద్ సూచించారు. వర్షం పడుతున్న సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాల వద్ద ఉండకూడదన్నారు. ఈదురు గాలుల కారణంగా రోడ్లపై చెట్లు విగిరిపడే ప్రమాదం ఉండడంతో రాత్రి ప్రయాణాలు తగ్గించాలని, తప్పనిసరి అయితే తప్ప బయటికి వెళ్లకూడదని కోరారు. ఉరుములు, మెరుపుల కారణంగా పిడుగు పడే అవకాశం ఉన్నందున పొలాల వద్ద ఉండే రైతులు, పశువుల, గొర్రెల కాపరులు జాగ్రత్తగా ఉండాలన్నారు

విమల రణదీవేకు ఘన నివాళి

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం సీఐటీయూ అఖిల భారత వ్యవస్థాపక అధ్యక్షురాలు విమల రణదీవే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షురాలు సునీత, జిల్లా సభ్యులు జ్యోతి పలు కార్మిక సంఘాల నాయకులతో కలిసి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ విమల చిన్ననాటి నుంచే జాతీయోద్యమంలో పనిచేశారని, 12 ఏళ్ల వయస్సులో కాంగ్రెస్ సేవాదళ్ వలంటీర్‌గా చేరారన్నారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో, విదేశి వస్తు బహిష్కరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నందిమళ్ల రాములు, శారద, భాగ్య, కమల, నారాయణమ్మ, లక్ష్మి, చిట్టెమ్మ, ఆశాలత, సునీత తదితరులు ఉన్నారు.



‘ఆస్తిపన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ’



కమిషనర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను చెల్లించే వారికి 5 శాతం తగ్గింపుతో ప్రభుత్వం కల్పించిన రిబేట్ అవకాశం ప్రయోజనాల గురించి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో ఫ్లెక్సీలు వేయించడంతో పాటు, పోస్టర్లు రూపొందించి ఇంటింటికీ వార్డు ఆఫీసర్ల ద్వారా చేరవేయాలని సూచించారు. వార్డు అధికారులు వారి పరిధిలోకి వచ్చే ప్రాపర్టీలను నిర్ధారించి సంబంధిత జాబితాను అందజేయాలన్నారు. సంబంధిత మున్సిపాలిటీల్లో అత్యధిక ఆస్తిపన్ను కట్టే వారి వివరాల జాబితాను రూపొందించి వార్డు ఆఫీసర్లకు ఇవ్వాలని సూచించారు. ఈ నెల 30 వరకు ఎర్లీ బర్డ్‌లో ఆస్తి పన్ను చెల్లింపునకు అవకాశముంటుందని తెలియజేయాలన్నారు. అదేవిధంగా వార్డ్ ఆఫీసర్లకి ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించడం గురించి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఆస్తి పన్నుతో పాటు, నల్లా పన్నులు మీద కూడా దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో వనపర్తి కమిషనర్ వెంకటేశ్వర్లు, కొత్తకోట కమిషనర్ సైదయ్య, ఆత్మకూర్, పెబ్బేరు, అమరచింత కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న స్వరూప

కొత్తకోట రూరల్: బాల్యవివాహాలను ప్రోత్సహించినా, పిల్లలను పనిలో పెట్టుకున్నా చట్టపరంగా చర్యలు ఉంటాయని జిల్లా బాలల పరిరక్షణ కౌన్సిలర్ స్వరూప అన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో గురువారం కొత్తకోట, మదనాపురం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ, వివిధ అంశాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ కౌన్సిలర్ స్వరూప మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం 2006, పోక్సో చట్టం 2012, దత్తత ప్రక్రియ, అనాథ పిల్లలకి అందించే సేవలు గురించి వివరించారు. చిన్నపిల్లలను పనులకు పంపించకూడదని, బాల కార్మిక వ్యవస్థని ఎవరూ ప్రోత్సహించకూడదన్నారు. బడి వయస్సు పిల్లలు ప్రతి ఒక్కరిని విధిగా పాఠశాలల్లో చేర్పించి దేశ భవిష్యత్‌కు పాటుపడాలన్నారు. బాలల హక్కులకు భంగం కలిగితే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 181, 100 ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, కవిత, కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త అనిత, హెల్త్ అసిస్టెంట్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి



ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య

గోపాల్‌పేట: విద్యార్థులు చిన్ననాటి నుంచే సమాజ సేవ, తోటి వారికి సహాయపడే గుణం అలవర్చుకోవాలని వనపర్తి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య సూచించారు. మండల కేంద్రంలో వనపర్తి డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈశ్వరయ్య హాజరయ్యారు. విద్యార్థులు గోపాల్‌పేటలో పారిశుద్ధ్యం సేవలు అందించడం సంతోషకర విషయం అన్నారు. వారం రోజుల వ్యవధిలో వారు చేసిన కార్యక్రమాలు వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని అభినందించి అందరికీ సర్టిఫికెట్లు అందించారు. యువత, విద్యార్థులు మత్తుకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు వారిని నిరంతరం గమనించాలని, యువకులు బెట్టింగ్ యాప్‌లు, డ్రగ్స్, సిగరెట్ లాంటి వ్యసనాలకు దూరంగా సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ పోతురాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తోడ్పాటునందించాలి



గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తూ వాటి బలోపేతానికి తల్లిదండ్రులు తోడ్పాటునందించాలని ఎంఈఓ శ్రీనివాసులు కోరారు. గురువారం మండలంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్యా బోధన సాగుతుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తుందన్నారు. పాఠశాలల్లో గురుకుల పాఠశాలకు ఎంపికైన అభినవ్, జస్వంత్‌రెడ్డి ని ఎంఈఓ అభినందించారు. పాఠశాలల్లో ఆట-పాట, మాటల మేలు కలయికగా కార్యక్రమం నిర్వహించారన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనంద్, పాఠశాల హెచ్‌ఎం కురుమూర్తి, ఉపాధ్యాయులు విజయలత, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘రైతుల సంక్షేమానికే కొనుగోలు కేంద్రాలు’



ఈర్లదిన్నెలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ రవికుమార్ యాదవ్

అమరచింత: రైతులు పండించిన వరిధాన్యాన్ని నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ మద్దతు ధర ఇవ్వడంతో పాటు సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవికుమార్‌యాదవ్ కోరారు. మండలంలోని ఈర్లదిన్నె, నందిమళ్ల, ఎక్స్‌రోడ్‌లో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ధాన్యం అమ్మే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవద్దనే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కృష్ణవేణి, సీసీ బీసన్న, తిరుపతమ్మ, నిజాం, కాంగ్రెస్ నాయకులు అరుణ్, వెంకటన్న, చిన్న ఆశిరెడ్డి పాల్గొన్నారు.

నేడు వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఖిల్లాఘనపురం: మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు సింగల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, సీఈఓ ప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9:30 గంటలకు మండలంలోని అప్పారెడ్డిపల్లిలో, 10 గంటలకు మల్కిమియాన్‌పల్లి, 10:15 కు ఈర్లతండా, 10:30 గంటలకు అల్లమాయపల్లి, 11:10 గంటలకు తిర్మలాయపల్లి, 11:30 గంటలకు కమాలోద్దీన్‌పూర్‌లో సింగల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సాక్షి, నెట్‌వర్క్: గర్భిణులు, బాలింతలు సరైన పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మమ్మ, వైద్యాధికారి నందకిషోర్ అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం లబ్ధిదారులకు పోషకాహారం అందించారు.

- ఆత్మకూర్ మండలంలోని ఆరేపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం చేయించారు. తిప్డంపల్లి పీహెచ్‌సీ వైద్యులు గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు సూర్యకళ, ఆశమ్మ, నర్సుబాయి, ఏఎన్‌ఎం షాహీన్ ఉన్నారు.
- పాన్‌గల్ మండల కేంద్రంలోని ఒకటి, ఐదో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాల ప్రాముఖ్యత, పోషకాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీన్ బేగం గర్భిణి, బాలింతలకు అవగాహన కల్పించారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్ శాంతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, ఇందిర, బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ నరేందర్ పాల్గొన్నారు.
- అమరచింత పట్టణంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ రాధిక ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం విశిష్టత గురించి వివరించారు.